సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



పల్లె అభివృద్ధికి ఆశలు!

తాండూరు మండలంలోని ఆయా గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరు అయ్యాయి. 8లో▸



చెట్ల కిందే పడిగాపులు!

ఎండల తీవ్రత పెరగడంతో బస్ షెల్టర్లు లేని చోట ప్రయాణికులు చెట్ల కింద సేదతీరుతున్నారు. 8లో▸



ఆదరణ కరువు

ఉద్యాన పంటలకు ప్రభుత్వ ఆదరణ కరువైంది. రాయితీలు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

డీపీటీసీని పరిశీలించిన ఎస్పీ



పోలీసు శిక్షణ కేంద్రంలో పర్యటిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి తదితరులు

అనంతగిరి: వికారాబాద్‌లోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని గురువారం ఎస్పీ కోటిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు త్వరలో శిక్షణ పొందేందుకు ఇక్కడికి వస్తారని తెలిపారు. వారి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పరేడ్ గ్రౌండ్, బ్యారక్‌లు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్లు, వంట గది, క్లాస్ రూం తదితర వాటిని పరిశీలించారు. ఆయన వెంట డీటీసీ ప్రిన్సిపాల్ మురళీధర్, వైస్ ప్రిన్సిపాల్ విజయ్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధిపై యువతకు అవగాహన



మాట్లాడుతున్న షేక్ అబ్దుల్ సుభాన్

వికారాబాద్ అర్బన్: తెలంగాణ రాష్ట్ర ఉపాధి, శిక్షణ డైరెక్టరేట్ సంకల్ప్ స్కిల్ డెవలప్‌మెంట్ ఏపీ ప్రొడక్టివిటి కౌన్సిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని స్వాగత్ హోటల్‌లో నిరుద్యోగ యువతి యువకులకు ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్దుల్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.స్వయం ఉపాధి,వేతన ఉపాధి, మహిళలు, యువతకు గల అవకాశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఐటీఐ ప్రిన్సిపాల్ నరేంద్రబాబు,శిక్షకులు వెంకటేష్,శ్రీధర్, ఏపీసీసీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ దుర్గారెడ్డి, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఒక్క పూటే పనులు కేటాయించాలి

అనంతగిరి: వేసవి సమీపిస్తున్నందున మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఒక్క పూట మాత్రమే పనులు కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. గురువారం అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వడం తోపాటు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు శంకర్, బుచ్చయ్య, జంగమ్మ, జ్యోతి, సమీల్ రాజు, రాములు, యాదమ్మ, అనంతయ్య, శంకరయ్య, చందర్, లక్ష్మి; దశరథ్ , అలివేలు పాల్గొన్నారు.

నేడు క్రీడాకారుల ఎంపిక

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం కబడ్డీ గ్రౌండ్‌లో శుక్రవారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలురు, బాలికల జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జట్టుకు ఎంపికైన క్రీడా కారులు ఈ నెల 16 నుంచి 19 వరకు సూర్యాపేటలో నిర్వహించే 33వ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని తెలిపా రు.జిల్లా సబ్ జూనియర్ కబడ్డీ ఎంపిక పోటీల కు హాజరయ్యేందుకు 55 కిలోల బరువు,16 సంవత్సరాల లోపు వాళ్లకే అర్హత ఉందన్నారు. ఆధార్‌కార్డును వెంట తీసుకురావాలన్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్

పాత కొడంగల్‌లో మరో రెండు గురుకులాలు

- ఉన్నత విద్యాలయాలకు స్థలాల పరిశీలన
- త్వరలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న సీఎం రేవంత్



పాత కొడంగల్‌లోని ట్రైబల్ బాలుర గురుకుల పాఠశాల భవనం

కొడంగల్: కొడంగల్ నియోజకవర్గం త్వరలో ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. వసతులు లేవన్న కారణంతో గతంలో ఈ ప్రాంతానికి మంజూరైన రెండు గురుకులాలను వేరే చోట ఏర్పాటు చేశారు. వాటిని తిరిగి ఇక్కడకు తెచ్చేందుకు రంగం సిద్ధమైంది. కొడంగల్‌లో మెడికల్, ఆయుష్ కళాశాలలు, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, కొత్త మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు కానున్నాయి. పాత కొడంగల్ మూడు గురుకులాలకు వేదిక కానుంది. గ్రామ శివారులోని ప్రభుత్వ స్థలంలో ఇప్పటికే ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ కమ్ కాలేజీ నడుస్తోంది. ఈ గురుకులంలో సుమారు ఐదు వందల మందికి విద్యను అందిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా భవనాన్ని నిర్మించారు. మౌలిక సదుపాయలతో పేద విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యను అందిస్తున్నారు.

కొత్తగా మరో రెండు గురుకులాలు

గతంలో ఈ ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేవనే నెపంతో కొడంగల్‌కు మంజూరైన రెండు గురుకులాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. అందులో ఒకటి చేవేళ్ల సమీపంలో ముడిమ్యాల్ గ్రామ శివారులో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాల కాగా మరొకటి బొంరాస్‌పేట మండలం చిల్‌ముల్ మైలారం గ్రామంలో అద్దె భవనంలో కొనసాగుతోంది. చాలీచాలని వసతులతో మైనార్టీ విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. రేవంత్ ముఖ్యమంత్రి అయిన తర్వాత సోషల్ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. కడా ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించారు. పాత కొడంగల్ శివారులోని ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తే విద్యార్థులకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. అంతేకాకుండా కొడంగల్ పెద్ద చెరువు సమీపంలో ఉండడం వల్ల భవిష్యత్తులో విద్యార్థుల మానసిక ఉల్లాసానికి అవకాశం కల్పించినట్లు అవుతుంది. కొడంగల్ పెద్ద చెరువు కట్టను అభివృద్ధి చేసి ట్యాంకు బండ్‌గా మార్చడానికి మున్సిపల్ పరిధిలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో ప్రస్తుతం పాత కొడంగల్ శివారులో ఉన్న గిరిజన బాలుర గురుకులం సమీపంలో సాంఘిక సంక్షేమ శాఖ గురుకులం, మైనార్టీ గురుకులాలను నిర్మించడానికి కసరత్తు సాగుతోంది.

ఎడ్యుకేషన్ హబ్‌గా..

సమీప భవిష్యత్తులో కొడంగల్ నియోజకవర్గం ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది. మెడికల్ కళాశాల, ఆయుష్ కళాశాలతో పాటు ఆస్పత్రుల నిర్మాణం, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, కొత్త మండలాల్లో జూనియర్ కళాశాలలు తదితర ఉన్నత విద్యాలయాలను ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ పర్యటనలో వీటికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన స్థలాలను గుర్తించడంలో అధికారులు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ స్థలాలపై ఆరా తీస్తున్నారు. అటవీ శాఖ, అసైన్డు భూములతో పాటు నిరుపయోగంగా ఉన్న భూములను పరిశీలిస్తున్నారు.

సీఎం స్పెషల్ ఫోకస్

రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే ఈ ప్రాంత అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆయనకు నియోజకవర్గంపై పూర్తి అవగాహన ఉంది. ప్రతి గ్రామం, ప్రతి తండా తెలుసు. ఈ ప్రాంతంలోని సామాజిక వర్గాలు, నాయకులు, అంకిత భావంతో పనిచేసే ఉద్యోగులు తెలుసు. 2009 నుంచి 2018 వరకు అభివృద్ధికి బీజం వేసి ప్రజల గుండెల్లో నిలిచారు. ఇప్పుడు సీఎంగా ఉండటంతో నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. రోడ్లు, కళాశాలలు, మౌలిక వసతులు, పారిశ్రామికంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులను సమాయత్తం చేశారు. ఈ నెలలోనే సీఎం కొడంగల్ పర్యటన ఖరారు కానుంది. ఆయన చేతుల మీదుగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నట్లు అధికారులు తెలిపారు.



ఓటర్లు 9,84,068

తుది జాబితా విడుదల

- నాలుగు నెలల్లో భారీగా పెరిగిన ఓటర్లు
- గణనీయంగా పెరిగిన మహిళా ఓటర్లు
- లోక్‌సభ నామినేషన్లు ముగిసేదాకా నమోదుకు అవకాశం

వికారాబాద్: త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కసరత్తును ప్రారంభించింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు వచ్చిన ఓటరు దరఖాస్తులను క్రోడీకరించి గత నెలలో అధికారులు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ (ముసాయిదా ఓటరు జాబితా)ను విడుదల చేయగా, తాజాగా బుధవారం తుది జాబితాను విడుదల చేశారు. గతేడాది అక్టోబర్‌లో విడుదల చేసిన ఓటరు తుది జాబితాతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగింది. పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. లోక్‌సభ నామినేషన్ల ప్రక్రియ ముగిసే దాకా కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం ఉంది. అప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారితో అనుబంధ జాబితాను విడుదల చేస్తారు. దీంతో జిల్లాలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

మహిళా ఓటర్లే అధికం

జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. పురుష ఓటర్లు 4,86,109మంది ఉండగా.. మహిళా ఓటర్లు 4,97,920 మంది ఉన్నారు. ఈ లెక్కన 11,811మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో మాత్రమే పురుష ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికం.

నియోజకవర్గాల వారీగా

ఓటరు తుది జాబితా ప్రకారం వికారాబాద్ నియోజకవర్గంలో 2,31,679 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,15,019 మంది, మహిళలు 1,16, 647 మంది, ట్రాన్స్ జెండర్లు 13 ఉన్నారు. తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2,43,849 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,18,228 మంది, మహిళలు 1,25,614 మంది,ట్రాన్స్ జెండర్లు ఏడు మంది ఉన్నారు. పరిగి నియోజకవర్గంలో 2,66,273 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,33,625 మంది, మహిళలు 1,32,639 మంది,9 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నారు.కొడంగల్‌లో 2,42,267 మంది ఓటర్లు ఉండగా, పురుషులు 1,19,237,మహిళలు 1,23,020 మంది, ట్రాన్స్ జెండర్లు 10మంది ఉన్నారు. ఓటరు తుది జాబితాలో పేరు లేనివారు, 18 సంవత్సరాలు నిండిన వారు విధిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



రైతులతో మాట్లాడుతున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్

పరిహారం, ఇంటికో ఉద్యోగం

- భూములిచ్చే రైతులకు ప్రభుత్వ అండ
- కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్

కొడంగల్: కొడంగల్ పరిధిలో ఏర్పాటు చేయనున్న మెడికల్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం భూములు ఇచ్చే రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్ తెలిపారు. గురువారం వారు అధికారులతో కలసి మండలంలోని అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో ఉన్న 75 ఎకరాల అసైన్‌మెంట్ భూములను పరిశీలించారు. అక్కడి భూములను 47 మంది రైతులు సాగు చేయడాన్ని గుర్తించారు. రెవెన్యూ కార్యాలయంలో రైతులతో సమావేశమై అభిప్రాయాలు సేకరించారు. అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో ఉన్న అసైన్మెంట్ భూములను ప్రభుత్వానికి అప్పగించాలని కోరారు. అందుకు ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తుందని, కుటుంబంలో ఒకరికి మెడికల్ కళాశాల లేదా ఆసుపత్రిలో ఉద్యోగం ఇస్తామని చెప్పారు. అర్హతలను బట్టి తగిన ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు రైతులు మాట్లాడుతూ.. తాము ఆ భూముల్లో సాగులో ఉన్నామని, అవే జీవనాధారమని పేర్కొన్నారు. ఆ భూమి ద్వారా వచ్చే ఆదాయంతో బతుకుతున్నామని తెలిపారు. భూములు కోల్పోతే తమ భవిష్యత్ అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు ప్రభుత్వంతో చర్చించి పరిహారం ఎక్కువగా వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. పరిహారం డబ్బుతో ఇతర ప్రాంతాల్లో పట్టా భూములను కొనుగోలు చేయాలని సూచించారు. అసైన్‌మెంట్ భూములైతే అమ్మడానికి, కొనడానికి అవకాశం ఉండదని, పట్టా భూములు అయితే పూర్తి హక్కులు ఉంటాయని వివరించారు. రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి వివరించి తగిన న్యాయం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, అప్పాయిపల్లి రైతులు శ్రీనివాస్, పకీరప్ప, మోతీబాయి, రుక్మిణి, వెంకటయ్య, మల్లప్ప, గ్రామస్తులు బాల్‌రాజ్, రమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

‘గులాబీ’కి పట్నం గుడ్‌బై

- కాంగ్రెస్‌లో చేరుతారని ఏడాదిగా ప్రచారం
- నాడు రేవంత్‌రెడ్డితో విభేదాలు
- నేడు ఒకే వేదికపైకి..



మహేందర్‌రెడ్డి పార్టీ మారనుండటంతో సంబరాలు చేసుకుంటున్న బీఆర్ఎస్ నేతలు

తాండూరు: మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ఊహాగానాలకు బలం చేకూరింది. గురువారం పట్నం మహేందర్‌రెడ్డి, అతని సతీమణి జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి నగరంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం చర్చనీయాంశంగా మారింది. త్వరలో కారు పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. నేడో రేపో అధికారికంగా కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉన్న మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీలతో కలిసి బీఆర్ఎస్ వీడనున్నట్లు సమాచారం. 1994 నుంచి మూడు పార్టీలు మార్చిన మహేందర్‌రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయాలను మూడు దశాబ్దాలుగా శాసిస్తున్నారు. 1994లో టీడీపీ తరఫున తాండూరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి తొలిసారి విజయం సాధించారు. వరుసగా మూడు సార్లు తాండూరు ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి గెలుపొందారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనంతో ఓటమి చెందారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీడీపీ తెలంగాణ రాష్ట్రంలో నిర్వీర్యం అయింది. దీంతో బీఆర్ఎస్ పార్టీలో చేరి మరోసారి విజయం సాధించారు. మంత్రివర్గంలో చోటు లభించింది. టీడీపీలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. మరోవైపు మహేందర్‌రెడ్డి సతీమణి ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు పర్యాయాలు పని చేశారు. వికారాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లా తొలి చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు.

రేవంత్‌ను ఓడించిన పట్నం బ్రదర్స్

2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డిని ఓడించేందుకు పట్నం మహేందర్‌రెడ్డిని మాజీ సీఎం కేసీఆర్ రంగంలోకి దింపారు. పట్నం సోదరుడు పట్నం నరేందర్‌రెడ్డిని బీఆర్ఎస్ కొడంగల్ అసెంబ్లీ అభ్యర్థిగా బరిలో నిలిపారు. నరేందర్‌రెడ్డి గెలుపులో మహేందర్‌రెడ్డి పాత్ర కీలకమనే చెప్పవచ్చు.

చేవేళ్ల స్థానం.. మంత్రి పదవి..?

మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి కుటుంబం సీఎం రేవంత్‌రెడ్డిని కలవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీలో చేరిక దాదాపు ఖరారు అయినప్పటికీ పట్నం దంపతులు కాంగ్రెస్ నేతల ఎదుట రెండు పదవులు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. అందులో ఒకటి పట్నం మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్సీ హోదాలో మంత్రి పదవి, సతీమణి సునీతారెడ్డికి చెవేళ్ల పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ఈ రెండు పదవులు ఇచ్చేందుకు హస్తం పెద్దలు సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే పట్నం మహేందర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడేందుకు సిద్ధం కావడంతో బీఆర్ఎస్ నేతలు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించం

- ఓడినా రోహిత్ తీరు మారడం లేదు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న థారాసింగ్, నాయకులు

తాండూరు: తాండూరు ప్రజలు రోహిత్‌రెడ్డిని ఓడించినా అతని తీరు మారడం లేదని పీసీసీ ప్రధాన కార్యదర్శి థారాసింగ్ జాదవ్ విమర్శించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. రోహిత్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కేవలం ఎన్నికల సమయంలో అభివృద్ధి పనులు మంజూరు చేయించినట్లుగా తమాషాలు చేశారన్నారు. ఈ ప్రాంత రోడ్లను మెరుగు పరచడంలో ఘోరంగా విఫలమయ్యారని ఆరోపించారు. కోట్‌పల్లి, జుంటిపల్లి ప్రాజెక్టులను ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. పట్నం మహేందర్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేశారని, వాటిని కూడా సక్రమంగా వినియోగించుకోలేక పోయారని విమర్శించారు. ఎన్నికల ముందు నిధులు లేని జీఓలను తెచ్చి ప్రజలను మభ్య పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, డీసీఎంఎస్ డైరెక్టర్ రవిగౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు హబీబ్ లాల, మున్సిపల్ కౌన్సిలర్లు వెంకన్నగౌడ్, బోయ రవిరాజ్, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖవి, నాయకులు జనార్దన్‌రెడ్డి, సర్దార్‌ఖాన్, కొమ్ము గోపాల్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పండగ వచ్చేసింది

- నేటినుంచి ఎన్టీఆర్ స్టేడియం వేదికగా హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన
- 365 స్టాళ్లలో కొలువుదీరనున్న విభిన్న భాషల గ్రంథాలు

సాక్షి, సిటీబ్యూరో: పుస్తక ప్రియులకు పండగే. చదువరులకు ఇక వరమే. ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే హైదరాబాద్ జాతీయ పుస్తక ప్రదర్శన వచ్చేసింది. ఏటా డిసెంబర్ చివరి 10 రోజుల పాటు నిర్వహించే ప్రదర్శన ఈసారి ఎన్నికలు, ఇతరత్రా కారణాలతో రెండు నెలలు ఆలస్యమైంది. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం పుస్తక ప్రదర్శన ప్రారంభం కానుంది. ఈ నెల 19 తేదీ వరకు కొనసాగనుంది. చదువరి చెంతకు పుస్తకంఅనే లక్ష్యంతో హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ ఏడేళ్లుగా ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తోంది. ఏటా 6 నుంచి 7 లక్షల మందికి పైగా పుస్తకప్రియులు ప్రదర్శనలో పాల్గొంటున్నారు. నచ్చిన పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలతో పాటు చరిత్ర, సామాజిక, తత్వశాస్త్రాలు, విజ్ఞాన గ్రంథాలకు పాఠకాదరణ పెరిగింది. మరోవైపు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం కొన్ని ప్రచురణ సంస్థలు ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా పుస్తకాలను ముద్రించి అందుబాటులోకి తెస్తున్నాయి. ఒక్క హైదరాబాద్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా పుస్తకాలకు ఆదరణ పెరిగిందని పలు సర్వేలు పేర్కొంటున్నాయి. కోల్‌కతాలో గత జనవరిలో నిర్వహించిన పుస్తక ప్రదర్శనలో సుమారు 29 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. హైదరాబాద్ పుస్తక ప్రదర్శనకు సైతం ప్రతి సంవత్సరం పాఠకుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోంది. ఏటా లక్షలాది పుస్తకాలు అమ్ముడవుతున్నాయి.

డిజిటల్ మీడియా వెల్లువలోనూ..

సోషల్ మీడియా, డిజిటల్ మీడియా వెల్లువలోనూ పుస్తకానికి విశేషమైన ఆదరణ లభిస్తోంది. సామాజిక చింతనకు, ప్రాపంచిక దృక్పథాన్ని అలవర్చుకొనేందుకు సాహిత్య అధ్యయనం ఒకటే మార్గం. సాహిత్యాన్ని జీవితంలో భాగంగా చేసుకున్నవాళ్లే గొప్ప విజేతలుగా నిలుస్తారు. అలాంటి అభిరుచి కలిగిన పాఠకులు కోట్లాది మంది ఉన్నారు అని హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అభిప్రాయపడ్డారు. సామాజిక మాధ్యమాలు ఉద్ధృతంగా వెల్లువెత్తినా ఏడేళ్లుగా పుస్తక ప్రదర్శనలు విజయవంతంగా కొనసాగడం, లక్షలాది పుస్తకాలు అమ్ముడు కావడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మరోవైపు ప్రతి సంవత్సరం వందల కొద్దీ కొత్త పుస్తకాలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో ఎంతోమంది రచయితలు తమ సృజనాత్మకతకు పదును పెట్టుకుంటున్నారు. ఈసారి పుస్తక ప్రదర్శనలో సదస్సులు, చర్చలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. కవులు, రచయితలు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ సంవత్సరం 365 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వందలాది పుస్తక ప్రచురణ సంస్థలు ప్రదర్శనలో పాల్గొననున్నాయి.

పిల్లలకు ప్రత్యేక పోటీలు..

బాల వికాస్ కార్యక్రమాల్లో భాగంగా పిల్లలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయి. జానపద నృత్యాలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, క్విజ్, మాట్లాడే బొమ్మ, పిల్లల గ్రంథాలయాల ఆవశ్యకతపై చర్చ, హస్తకళల వర్క్‌షాపు, గ్రూప్‌డ్యాన్స్, సోలోడ్యాన్స్, పాటలు, పద్యాలు, పెయింటింగ్, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రవేశం ఉచితం. ఇతరులకు ప్రవేశ రుసుము రూ.10. పుస్తక మహోత్సవంలో భాగంగా సాంస్కృతిక, కళా రూపాలను ప్రదర్శించనున్నారు. పుస్తక ప్రదర్శన ప్రతిరోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8.30 గంటల వరకు, శని, ఆదివారాల్లో మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుంది.

క్లుప్తంగా

ఆలయ పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్ రూరల్: పట్టణంలోని మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయ పాలక మండలి (ట్రస్టు బోర్డు సభ్యులు) కోసం ఆసక్తి కలిగినవారు దరఖాస్తు పంపించాలని ఆలయాధికారి బాల్‌రాజ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ రంగారెడ్డి జిల్లా కార్యాలయానికి దరఖాస్తులు పంపించాలన్నారు. పాలక మండలి సభ్యులకు నేటి నుంచి 20 రోజుల వరకు గడువు ఉన్నట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆర్పీల వినతి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

తాండూరు టౌన్: సమస్యలను పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి ఆర్పీలు(రిసోర్స్ పర్సన్) గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర వహిస్తున్న ఆర్పీలకు చాలీచాలని వేతనాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లి వేతనాలు పెరిగేలా చూడాలన్నారు. అలాగే సముచిత గౌరవం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమస్యలను తప్పకుండా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్



సీఐటీయూ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేస్తున్న శ్రీనివాస్

పెద్దేముల్: కార్మిక సంఘాలు ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొనాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో సమ్మెకు సంబంధించి గోడ పత్రిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అందుకు సంబంధించి సమ్మె నోటీసు ఎంపీడీఓ షేక్‌సుభాకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సూచిక బోర్డును ఢీకొని వ్యక్తి మృతి

షాబాద్: రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును ఢీకొట్టి ఓ ద్విచక్ర వాహనదారుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గేట్ వద్ద గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన ప్రకారం... మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామానికి చెందిన చిందేటి రంగయ్య (55) గురువారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి నాగర్‌గూడకు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లారెడ్డిగూడ స్టేజీ వద్ద రోడ్డు పక్కనున్న సూచిక బోర్డును ఢీకొట్టాడు. ఆయన తలకు బలమైన గాయమవ్వడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పల్లె అభివృద్ధిపై ఆశలు!

పల్లెల్లో అభివృద్ధి పనుల కార్యాచరణకు చర్యలు మొదలయ్యాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలానికి నిధులు మంజూరయ్యాయి. దీంతో సీసీ రోడ్లు, మురుగునీటి పారుదల వివిధ పనులను చేపట్టనున్నారు. స్థానిక సంస్థలకు ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడంతో ప్రత్యేకాధికారుల సమక్షంలో పనులు చేయనున్నారు.

- ఎన్ఆర్ఈజీఎస్ కింద తాండూరుకు రూ.3 కోట్లు మంజూరు
- గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం
- మార్చి 31లోపు పూర్తి చేయాలని ఆదేశాలు



అంతారంలో అంతర్గత రోడ్డుపై పారుతున్న మురుగు

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాలకు ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరు అయ్యాయి. 33 గ్రామ పంచాయతీలకు రూ.3 కోట్ల నిధులు వచ్చాయి. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ రాజ్ అధికారులు నివేదికలు సమర్పించారు. మార్చి 31 లోపు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలు అభివృద్ధి పనులు చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించినట్లు తెలుస్తోంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. ప్రత్యేకాధికారుల తీర్మానం చేసిన వెంటనే ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాలకు మంజూరైన నిధులు

కరన్‌కోట్ గ్రామానికి రూ.30 లక్షలు. చెంగోల్, జినుగుర్తి, సంగెంకలాన్‌లకు రూ.15 లక్షలు కేటాయించారు. నారాయణపూర్, గోనూర్, చెన్‌గేస్‌పూర్, గౌతపూర్, చంద్రవంచ, మల్కాపూర్, ఐనెల్లి, మిట్టబాసుపల్లి, ఉద్దాండపూర్, సిరిగిరిపేట్, అంతారం, ఖాంజాపూర్ గ్రామాలకు రూ.10 లక్షలు. వీరిశెట్టిపల్లి, ఎల్మకన్నె, గోపన్‌పల్లి, బెల్కటూర్, చిట్టిఘనాపూర్, ఓగిపూర్, కోత్లాపూర్, కోటబాసుపల్లి, గుంతబాసుపల్లి, సంకిరెడ్డిపల్లి, గుండ్లమడుగుతండా, మైసమ్మతండా, వీరారెడ్డిపల్లి, రాంపూర్‌తండా, రాంపూర్, అల్లాపూర్, చింతమణిపట్నం, పర్వాతపూర్, అంతారంతండా, దస్తగిరిపేట్, బిజ్వార్ గ్రామాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యాయి.

పనులు పూర్తి చేస్తేనే బిల్లులు



మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శిలు తీర్మానం చేస్తే సరిపోతుంది. వార్డు సభ్యుల స్థానంలో గ్రామాల్లోని ప్రభుత్వ ఉద్యోగుల సంతకాలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 5 గ్రామాల నుంచి తీర్మానాలు అందాయి. అగ్రిమెంట్లు చేసుకున్న తర్వాత పనులు ప్రారంభిస్తాం. మార్చి 31లోపు పూర్తి చేస్తేనే బిల్లులు వస్తాయి.

– నందిని, ఏఈ, పంచాయతీరాజ్ విభాగం, తాండూరు

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

యాలాల: కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని అచ్యుతాపూర్ గ్రామంలో 'గావ్ చలో అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ భద్రత విషయంలో బీజేపీ పార్టీ ఎంతో కఠినంగా నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే తప్పనిసరిగా బీజేపీ మరోసారి అధికారంలోకి రావాల్సిందేనన్నారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామానికి చెందిన న్యాయవాది అమర్‌నాథ్‌రెడ్డిని బీజేపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేశం, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులను సవరించాలి

అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ



నమోదును పరిశీలిస్తున్న అధికారులు

నవాబుపేట: ప్రజాపాలనలో భాగంగా తీసుకున్న దరఖాస్తులలో తప్పులు దొర్లిన వాటిని సవరించాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సిబ్బందిని ఆదేశించారు. గురువారం నవాబుపేట, చిట్టిగిద్ద, దాదాపూర్ గ్రామాలలో ఆన్‌లైన్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాటాఎంట్రీలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్నారు. లబ్ధిదారులు పథకాలు పొందేలా సక్రమంగా నమోదు చేయాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మళ్లీ తప్పులు దొరికితే ఉపేక్షించేది లేదన్నారు. పంచాయతీరాజ్ అధికారి తరుణ్ కుమార్, తహసీల్దార్ జైరామ్, ఎంపీఓ విజయ్‌కుమార్ ఉన్నారు.

ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సేవలు



తిరుపతిలో కాగ్నా జల రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు

కాగ్నా జలరైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ శివయ్య

యాలాల: రైతులు ఆర్థికంగా వృద్ధి చెందేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు యాలాల కాగ్నా జల రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ శివయ్య పేర్కొన్నారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో డైరెక్టర్లతో కలిసి విజ్ఞాన యాత్రలో భాగంగా ఏపీలోని తిరుపతిని సందర్శించారు. తిరుపతిలో గత 25 ఏళ్లుగా కొనసాగుతున్న శ్రీ పద్మావతి మహిళాభ్యుదయ సంఘం సేవల వివరాలను తెలుసుకున్నారు. పద్మావతి సంఘం సేవలకు గాను గతంలో కేంద్ర ప్రభుత్వం గుర్తించి అవార్డును సైతం అందించిందని డైరెక్టర్లకు సిబ్బంది వివరించారు. సమాజంలోని మిగతా రైతులతో పాటు డైరెక్టర్లను ఇలాంటి కార్యక్రమాలను చేపట్టడానికి వీలున్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు శివయ్య అన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు చంద్రారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, శరణుభూపాల్, బెన్నూరు ఎంపీటీసీ లక్ష్మప్ప, ఏకలవ్య ఫౌండేషన్ సీఈఓ చంద్రకాంత్‌రెడ్డి, కాగ్నా జల రైతుఉత్పత్తిదారుల సంఘం సీఈఓ అవినాశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కిందే పడిగాపులు

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు



బస్‌షెల్టర్ లేక ఎక్కచెర్వుతండా గేటు వద్ద చెట్టు కింద ఉన్న ప్రయాణికులు

బొంరాస్‌పేట: వేసవి కాలం పూర్తిస్థాయిలో రాక ముందే ఎండలు మండుతున్నాయి. ఈ తరుణంలో బస్సులు ఆగడానికి నిలువ నీడ లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. బాపల్లితండా నుంచి కొడంగల్ వెళ్లే రహదారిలో దుద్యాల మండల పరిధిలోని గౌరారం, సాగారంతండా, చెట్టుపల్లితండా, చిల్ముల్‌మైలారం, పాత కొడంగల్‌తండా గేటు వద్ద, నాజీఖాన్‌పల్లి గ్రామాల్లో ప్రయాణికులు నిలబడటానికి స్థలాలు లేవు. మండల కేంద్రం నుంచి దుప్‌చర్ల వెళ్లే దారిలో జానకంపల్లి, దుప్‌చర్ల గ్రామాల బస్టాప్‌ల వద్ద చెట్లు కూడా కరువయ్యాయి. తుంకిమెట్ల నుంచి నాందార్‌పూర్, బాపల్లి, అనంతపూర్, దుద్యాల మండలం ఈర్లపల్లి, లగచెర్లగేటు, హకీంపేట, గ్రామాల వద్ద ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. షెల్టర్లు ఉన్న చోట శిథిలమైపోయి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతుకు నోచుకోవడం లేదు. బస్‌షెల్టర్లు నిర్మించి ప్రయాణికుల అవస్థలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు

వికారాబాద్ డివిజన్ పరిపాలన విభాగం అధికారి గోవిందమ్మ

సాక్షి ఎఫెక్ట్..



రిజిస్ట్రేషన్ ధ్రువ పత్రాలను పరిశీలిస్తున్న గోవిందమ్మ

దోమ: ధరణిలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రిజిస్ట్రేషన్లు చేయాలని వికారాబాద్ డివిజన్ పరిపాలన విభాగం అధికారి గోవిందమ్మ సూచించారు. ఈ నెల 7న 'సాక్షి'లో రిజిస్ట్రేషన్లకు తప్పని పడిగాపులు అనే శీర్షికతో ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ మేరకు గురువారం గోవిందమ్మ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ధ్రువ పత్రాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. భూ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలంటే రైతులు రోజంతా పడిగాపులు కాయాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పుడు స్లాట్ బుక్ చేసుకున్న వెంటనే రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. తహసీల్దార్ వాటికి సంబంధించిన ప్రొసీడింగ్‌లను అందజేస్తారన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అధికారులకు ఇబ్బందులకు గురి చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జరిగిన ఇబ్బందులకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

గిరిజన నేతల ముందస్తు అరెస్టు



గిరిజన నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

పరిగి: గిరిజన సంఘం నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీ సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించి సెలవు దినంగా ప్రకటించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ కోరారు. లేకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసనలు తెలుపుతామని హెచ్చరించడంతో గురువారం నాయకులను అరెస్టు చేశారు. అనంతరం శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గిరిజనులను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. లంబాడీల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించకపోవడం బాధాకమన్నారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర నాయకులు గోవింద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

13న కార్గో పార్సిల్ వేలం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ ఆర్టీసీ) షాద్‌నగర్ డిపోలో కొన్ని నెలలుగా తీసుకువెళ్లకుండా ఉన్న కార్గో పార్సిల్‌లోని వస్తువులను ఈ నెల 13న వేలం వేయనున్నట్లు డీఎం ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపోలో కార్గో పార్సిల్, కొరియర్ కౌంటర్‌లో కొంత కాలంగా ఉన్న వస్తువులను ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు వివరించారు. ఈ వేలంలో పాల్గొనేవారు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌ను (9154298615) ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో ఇల్లు దగ్ధం

కాలి బూడిదైన సామగ్రి



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పరిగి: అనుమానాస్పద స్థితిలో ఇల్లు దగ్ధమైన ఘటన మండల పరిధిలోని పోల్కంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నరేశ్, రమేశ్ అన్నదమ్ముల ఇళ్లను దుండగులు తగలబెట్టారు. గమనించిన స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చే లోపు ఇంట్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతి అయింది. ఇదిలా ఉండగా వారం రోజులుగా రోడ్డు ప్రమాదం కేసులో నిందితులుగా ఉన్న రమేశ్, అతని కుటుంబ సభ్యులు పరారీలో ఉన్నారు. తన బొలేరో వాహనంతో అదే గ్రామానికి చెందిన శివ, సాయితేజలు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందారు. అప్పటి నుంచి వాళ్లు పరారీలో ఉన్నట్టు సమాచారం. కోపోద్రిక్తులైన బాధిత కుటుంబ సభ్యులు రమేశ్ ఇంటి చుట్టూ కంప వేయడంతో సాయంత్రం ప్రమాదవశాత్తు అంటుకుని ఇల్లు దగ్ధం అయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు జరిగిందా, ఉద్దేశపూర్వకంగా జరిగిందా అనే కోణంలో విచారిస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

38 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాల అపహరణ



చిందరవందరగా పడేసిన వస్తువులు

నవాబుపేట: తాళం వేసిన ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగలగొట్టి దుండగులు 38 తులాల బంగారం, 40 తులాల వెండి ఆభరణాలు, వస్తువులు అపహరించిన సంఘటన బుధవారం వట్టి మీనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి ఈ నెల 5న ఆయన తండ్రి రామ్‌రెడ్డి అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆయన భార్య ఇద్దరు పిల్లలు ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లిపోయారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బంగారు, వెండి ఆభరణాలు అపహరించుకొని వెళ్లారు. గురువారం ఉదయం స్థానికులు గమనించి చంద్రశేఖర్‌రెడ్డికి విషయాన్ని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై భరత్ భూషణ్ పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారిణులకు టీషర్టులు అందజేస్తున్న చైర్మన్ తదితరులు

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్

పరిగి: క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా ఖోఖో పోటీలు నిర్వహించారు. త్వరలో నల్గొండ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గురువారం టీ షర్టులు, కిట్టును అందజేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. క్రీడలు ఆడటంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాధికారి హన్మంత్ రావు, మాజీ వైస్ ఎంపీపీ మాణిక్యం, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పరశురాంరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ రిజిస్ట్రేషన్లలో ఇష్టారాజ్యం



సంజీవ్ కుమార్



దోమ తహసీల్దార్ కార్యాలయం

దోమ: భూ రిజిస్ట్రేషన్‌లో తహసీల్దార్ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని మండలంలోని దొంగఎన్కెపల్లి గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్ ఆరోపించారు. ఆయన తండ్రిపై ఉన్న భూమిని తల్లిపేరున విరాసత్ చేయించడానికి గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. గత నెల 31న స్లాట్ బుక్ చేసుకున్నప్పటికీ ఈ నెల 7న రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో డాక్యుమెంట్స్ సరిగ్గా లేవని ఆర్ఐ నివేదిక రాలేదంటూ తహసీల్దార్ బెదిరింపులకు గురిచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఐ రిపోర్టు వచ్చిన అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామన్నారని వాపోయారు. అంతేకాక తహసీల్దార్ పురుషోత్తం భూ రిజిస్ట్రేషన్ చేసిన తరువాత రైతులకు అందించే ప్రొసీడింగ్‌లను రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఇవ్వకుండా తన చాంబర్‌లోకి రావాలని చెబుతున్నారన్నారు. ఇదేంటని అడిగితే వ్యాపారం మీరే చేస్తారా.. మేము చేయొద్దా? అంటూ మాట్లాడుతున్నారని రైతు ఆరోపిస్తున్నారు. సంబంధిత జిల్లా అధికారులు సదరు తహసీల్దార్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరారు.

ఆరోపణలు అవాస్తవం

ఈ విషయంపై తహసీల్దార్ పురుషోత్తంను వివరణ కోరగా.. ఆరోపణలన్నీ అవాస్తమన్నారు. విరాసత్ చేయాలని వస్తే డాక్యుమెంట్లు పరిశీలించి ఆర్ఐ పంచనామ చేసుకోవాలని మాత్రమే సూచించామన్నారు. ప్రొసీడింగ్స్‌ల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయడం లేదని రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే రైతులకు పత్రాలు అందిస్తున్నామన్నారు.

కేరళ అభివృద్ధికి గవర్నర్ సహకరించాలి



ధర్నాకు తరలివెళ్లిన నేతలు

షాద్‌నగర్: కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసే విధంగా ఆరాష్ట్ర గవర్నర్ వ్యవహరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్.రాజు అన్నారు. కేరళ గవర్నర్ వైఖరిని నిరసిస్తూ గురువారం సీపీఎం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు షాద్‌నగర్ నుంచి సీపీఎం నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఎస్.రాజు మాట్లాడుతూ.. కేరళలో ఎల్డీఎఫ్ వామపక్ష ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింపజేసుకున్న బిల్లులను గవర్నర్ తిరిగి పంపడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసే విధంగా గవర్నర్ వ్యవహరిస్తుందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని అన్నారు. కేరళ రాష్ట్ర అభివృద్ధికి గవర్నర్ పూర్తి స్థాయిలో సహకరించాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ధర్నాకు తరలివెళ్లిన వారిలో శ్రీను నాయక్, శివ, శ్రీకాంత్, బేరి శ్రీనివాస్, రాయికంటి గోపాల్, లక్ష్మీ తదితరులున్నారు.